నవల

# ఒక ఆత్మకథ

పొత్తూరి విజయలక్ష్మి

# *Oka Atma Katha*

Novel

By **Pothuri Vijayalakshmi**

© P. Vijayalakshmi

*Price* : **100/-**

*Published by :*

**Sri Rishika Publications**

Flat No. 201; Vikasini Apartments

2-2-1121/3 & 3A, New Nallakunta,

Hyderabad - 500 044

e-mail:pvlakshmi8@gmail.com

Ph: 040-2763 7729

మనిషికి కావలిసినవి ఏమిటీ అంటే కూడూ, గుడ్డా, గూడూ అని తేలిగ్గా చెప్పేస్తారు ఎవరైనా! ఆ మాట ముమ్మాటికీ నిజం. సర్వసామాన్యంగా మనిషై పుట్టిన ప్రతి వ్యక్తికీ ఆహారం, బట్టలూ తలదాచుకునేందుకు చోటూ ఉండనే వుంటాయి.

కలిగిన శ్రీమంతుడు భవంతులలో నివసిస్తూ, చీనీ చీనాంబరాలు ధరిస్తూ పంచభక్ష్య పరమన్నాలు భుజిస్తే, పేదవాడు కలోగంజో తాగి, చింకి పాత కట్టుకుని ఏ చెట్టుకిందో నివసిస్తాడు.

నిజం చెప్పాలంటే తిండీ, బట్టా నిలవనీడా వుంటే చాలదు. ఆ మూడు అవసరాలూ వున్నంత మాత్రాన జీవితం గడిచిపోదు. మానవ జీవితంలో ముఖ్యంగా కావలిసింది తోడు, ఆత్మీయత, ఆదరణ, ప్రేమ, అనురాగం, స్నేహం. ఇవేవీ లేకపోతే మనిషికీ రాతికీ తేడా వుండదు. మనిషన్నాక మనసుంటుంది. మనసున్న మనిషికి మరో పదిమంది మనసున్న మనుషుల సాంగత్యం కావాలి.

జన్మనెత్తిన మూడవ నెలలో మనిషిని గుర్తుపట్టి బోసి నవ్వులు నవ్వడంతో మొదలవుతుంది స్నేహం కోసం ఆరాటం. ఆఖరి క్షణం దాకా ఆ ఆరాటం కొనసాగుతూనే వుంటుంది. కంఠం లోంచి ప్రాణం పోయే స్థితికి ఆ జీవి అయినవారి వంక ఆశగా చూస్తూనే ప్రాణం వదిలేస్తాడు.

జీవితకాలంలో ఎన్నో సంబంధాలు, ఎన్నో బాంధవ్యాలు, మరెన్నో

అనుబంధాలు ఎందరో వ్యక్తులు ఎదురవుతూ వుంటారు. కొందరు తమ స్నేహ స్వభావంతో, మంచి మనసుతో మనసుకు సాంత్వన చేకూరుస్తారు. మరికొందరు చురకల్లాటి మాటలతో మనసుని గాయపరుస్తారు. విచిత్రం ఏమిటంటే ఈ సంబంధ బాంధవ్యాలు మన చేతుల్లో వుండవు.

మనం కోరుకునే వ్యక్తి దూరమైపోయే సంఘటనలూ వుంటాయి. వద్దురా భగవంతుడా అనే వ్యక్తి అనుదినం ఎదురయ్యే సంఘటనలూ వుంటాయి.

ఒకే రకమైన అభిరుచులూ, ఒకే రకమైన ఆలోచనలూ కలిగిన వ్యక్తులు ఏదో ఒక సందర్భంలో అనుకోకుండా ఎదురుపడి చెప్పలేనంత దగ్గరై పోతారు. ఐతే అటువంటి అదృష్టం చాలా కొద్దిమందికి మాత్రమే దక్కుతుంది.

మనసుకు నచ్చిన వ్యక్తితో స్నేహం కొనసాగించడం తేలికకాదు. ఒక విధంగా కత్తిమీద సాములాటిది. వయోభేదాలూ, స్త్రీ, పురుష భేదాలూ, అంతస్తులలోని తేడాలూ పరిస్థితుల ప్రభావాలూ, అడ్డు గోడగా నిలుస్తాయి.

వీటిన్నింటినీ అధిగమించి, మంచిస్నేహం ఏర్పడి ఆ అపురూపమైన బాంధవ్యం కలకాలం కొనసాగించడం అంటే ఎక్కడా పాము నోట పడకుండా వైకుంఠపాళిలో ఆఖరి గడికి చేరడమంతకష్టం.

స్నేహం అంటే ప్రాణం ఇచ్చే నాకు ఎంతోమందితో పరిచయాలూ, స్నేహాలూ ఏర్పడ్డాయి. ఎంతోమంది ఆప్తులున్నారు. ఆత్మీయులున్నారు. నీ జీవితంలో నీకు అత్యంత ఆనందం కలిగించే విషయం ఏమిటి అని ఎవరైనా నన్ను అడిగితే నా స్నేహితుల గురించి గుర్తు చేసుకోడం అని తడుము కోకుండా సమాధానం చెప్తాను.

అసంఖ్యాకంగా వున్న నా మిత్రుల జాబితాలో ఒక మంచి స్నేహితుడి కథ ఇది.

1978వ సంవత్సరం. ఒక ఇంటి నించి మరో ఇంటికి మారాం. అన్నీ ప్రభుత్వం వారి ఇళ్ళే. అలా ఇళ్ళు మారడంలో మా ప్రమేయం అంతగా వుండదు. బి టైప్ నించి సి టైప్‌కీ, సి టైప్ నించీ డి టైప్‌కీ పదోన్నతిని బట్టి, ఏలినవారి

జాబితాలో వున్న పేర్లను బట్టి వారి నిర్ణయానుసారం మారాల్సిందే. అలాగే బి టైప్ నించి సి టైప్‌కి వచ్చాం. ప్రభుత్వం వారు నిర్మించిన కాలనీలన్నీ చక్కగా తీర్చిదిద్దినట్లు వుంటాయి. విశాలమైన రోడ్లు, చెట్టూ, చేమా చూడముచ్చటగా వుంటాయి.

ఆ వీధిలో మాదే చివరి ఇల్లు. ఆ తరువాత అంతా ఖాళీ స్థలం. ఎత్తైన ప్రదేశంలో ఇల్లు. ఇంటెదురుగా రోడ్డు. ఇరుపక్కలా ఆకాశంలో పందిరి వేసినట్లు చెట్లు. పగటి పూట ఎంతో మనోహరంగా వుండేది. రాత్రి పూట మాత్రం చీకటి గుయ్యారంలా వుండేది. దూరంగా చెట్ల చాటున వీధి దీపాలు కొరివి దయ్యాల్లా వెలుగుతూ భయం వేసేది. ఎదురుగా కూడా ఇళ్ళు లేవు. కొండలూ – గుట్టలూ.

సి టైప్ ఇళ్ళలో రెండు భాగాలు కలిసే వుండేవి. అటో మల్లెపువ్వూ ఇటో మల్లెపువ్వు వేసి మాలకడతాం కదా. అలా అన్నమాట. మూడు పెద్ద గదులు. ముందుభాగంలో మధ్యగది పట్టున వరండా. వెనక పెద్ద వరండా. ఆ చివర స్టోర్ రూం. ఈ చివర వంట గది.

ఏ చడీ చప్పుడూ లేకుండా నిశ్శబ్దంగా ప్రశాంతంగా ముని ఆశ్రమంలా వుండేది. కానీ పొరుగున సందడి వుందా అంటే ఆ భాగం మెస్‌కి కేటాయించారు.

అందులో నలుగురు మగవాళ్ళే వుంటారని చెప్పారు. నీలకంఠాయ స్వాహా! పొరుగింటి ఇల్లాలితో ముచ్చట్లాడే అవకాశం కూడా లేదు. కానీ ఏం చేస్తాం? మన చేతుల్లో ఏమీ లేదు కదా!

అదీగాక అంతగా ముచ్చట్లాడే తీరికా వుండేది కాదు. పిల్లలిద్దరూ చిన్నవాళ్ళు పీకల దాకా పని. ఇరవై నాలుగ్గంటలూ చాలేవి కావు. వారం రోజులయ్యాక పని మనిషి ద్వారా తెలిసింది. పక్కింట్లో మగవాళ్లే కాదు. ఓ గదిలో ఒకాయన భార్యా పిల్లలతో కాపురం వుంటున్నాడుట. ఆవిడని పరిచయం చేసింది మా పనమ్మాయి.

ఆవిడ మంచావిడే. కానీ అదోరకం మనిషి. ఒకసారి కనిపిస్తే చక్కగా నవ్వుతూ పలుకరించి కబుర్లు చెప్పేది. మరోసారి ఎరగనట్టు మొహం తిప్పుకుని

వెళ్ళిపోయేది. అలాటి వాళ్ళంటే నాకసలు సరిపడదు. అందుకే దూరంగా వుండేదాన్ని.

పగలంతా పిల్లలతో వాకిట్లో వరండాలోనే వుండే దాన్ని. వాళ్ళకి అన్నాలు తినిపిస్తూ, ఆడిస్తూ కూరలు తరుక్కుంటూ కాలక్షేపం చేసేసే దాన్ని. ఎందుకంటే చీకటిపడితే ఇంటి లోపలే వుండాలిగా. మా అబ్బాయి పసి వాడు. ఆడినంత సేపూ ఆడుకుని ఒళ్ళో జేరిపోయి పాటపాడితే గానీ నిద్ర పోయే వాడు కాడు. జో అచ్యుతానంద వాడికెంత ఇష్టమైన లాలిపాట. ఇక నా పుత్రికా రత్నం చందమామ రావే పాడితే గానీ అన్నం తినేది కాదు.

పక్కవాటాలో వున్న నలుగురిలో ముగ్గురు సర్దార్జీలు. అందులో ఒకతను పొడవుగా సన్నగా వుండేవాడు. ఆదివారం తలంటు పోసుకుని, జుట్టు ఆరబెట్టుకుంటూ బయట పచార్లు చేసేవాడు. నడుము దాటిన నల్లని జుట్టు, అతని జుట్టు చూస్తే నాకు అసూయ కలిగేది. నా జుట్టు  భుజాలు దాటదుగా మరి!

ఒకరోజు ఆదివారం మేమిద్దరం వరండాలో కూర్చుని వున్నాం. అతను అలవాటు ప్రకారం జుట్టు విరబోసుకుని తిరుగుతున్నాడు. రెండిళ్ళ మధ్య ముళ్ళతీగతో కంచె వుండేది. కంచె దగ్గరకు వచ్చి నమస్కారం పెట్టాడు. ఈయన వెంటనే లేచి వెళ్ళారు. కరచాలనం చేసుకున్నారు. కాసేపు కబుర్లు చెప్పుకున్నారు.

వచ్చాక అతని వివరాలు చెప్పారు. పెళ్లయిందిట కానీ ఇల్లు దొరకక పోవడం వల్ల ఇలా ఒంటరిగానే వుంటున్నాడట. అతని పేరు బల్బీర్. బల్‌వీర్ అయి వుంటుంది. పలుకడం మరి వాళ్ళలాగే పలుకుతారు.

ఉద్యోగులకు సరిపడా ఇళ్ళు లేవు. అద్దెకి తీసుకుందామన్నా అన్నీ క్వార్టర్లే. ప్రైవేటు ఇళ్ళు వుండవు. వారి వంతు వచ్చేదాకా వేచి చూడాల్సిందే. బల్బీర్ పరిస్థితీ అదే!

ఆ తర్వాత ఎప్పుడైనా కనబడితే నమస్కారం పెట్టే వాడు. నేనూ ప్రతి నమస్కారం పెట్టేదాన్ని. అంతే మాటా పలుకూ వుండేవి కాదు. మా బెడ్ రూంని

అనుకునే అతనుండే గది. ఆవేళ కూడా పిల్లవాడికి జో అచ్యుతానంద లాలిపాట పాడి నిద్ర పుచ్చాను. మరునాడు సాయంత్రం నేను వరండాలో కూర్చుని వున్నాను. అతను డ్యూటీ నించీ సైకిల్ మీద వచ్చాడు. అప్పట్లో అందరికీ సైకిళ్ళే. నూటికి ఇరవై మందికి మాత్రం స్కూటర్లుండేవి. వాళ్ళ వరండాలో సైకిల్ స్టాండ్ వేసి కంచె దగ్గరికి వచ్చి నిలబడ్డాడు. 'నమస్తే బాభీజీ' అన్నాడు. మొట్టమొదటి సారి నాతో నేరుగా మాట్లాడుతూ. 'నమస్తే' అన్నాను.

''మిమ్మల్ని ఒక మాట అడగొచ్చా!'' అన్నాడు. సంభాషణ హిందీలోనే సాగుతోంది. ''అడగండి!'' అన్నాను.

''మీరు రోజూ లాలిపాట పాడతారు కదా! చాలా బావుంటుంది. నా గది లోకి స్పష్టంగా వినిపిస్తుంది'' అన్నాడు నవ్వుతూ.

అలా అనడం నాకంతగా నచ్చలేదు. అందుకే ముభావంగా వుండి పోయాను. అతనూ మళ్ళీ మాట్లాడలేదు. వెళ్ళిపోయాడు. ఒక ఆదివారం నాడు మేమిద్దరం వరండాలో కూర్చుంటే ''ఏం చేస్తున్నారు రావ్ సాబ్?'' అని పలుకరించాడు జుట్టు ఆర బెట్టుకుంటూ.

''ఏం లేదు. రండి  కాఫీ తాగుదాం!'' అని పిలిచారు ఈయన. వచ్చాడు. కాఫీ కలిపి ఇచ్చాను. ''చాలా బావుంది. ఫిల్టర్ కాఫీనా?'' అని మెచ్చు కున్నాడు.

కాసేపు కూర్చున్నాడు. కబుర్ల మధ్యలో ''బాభీజీ మీరు లాలిపాట చాలా బాగా పాడతారు'' అన్నాడు. 'అవునవును. మా పిల్లలు ఎంతఅల్లరి చేస్తున్నా వాళ్ళమ్మ లాలిపాట పాడితే వెం టనే నిద్రపోతారు. అలా పోకపోతే ఇంకా చాలాసేపు పాడుతుందని భయం వాళ్ళకి' అన్నా రాయన.

నవ్వేశాడు అతను. ''మీకు ఓమాట చెప్పాలి రావ్ సాబ్. నా చిన్నతనంలో లీలగా గుర్తు. మా అమ్మ ఈ పాటే పాడేది'' అన్నాడు.  ఆశ్చర్యపోయాం! వాళ్ళమ్మ జో అచ్యుతానంద లాలిపాట ఎలా పాడుతుంది? ఎందుకు పాడుతుందీ? ఆ మాటే అడిగాను.

''మా అమ్మ తెలుగు వాళ్ళమ్మాయి. ఆవిడ పేరు శారద. మా నాన్నగారు

**End of Preview.**

**Rest of the book can be read @**

**[http://kinige.com/book/Oka+Atma+Katha](http://kinige.com/book/Oka+Atma+Katha)**

* * *